ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సిద్దిపేట
శుక్రవారం 19 జూలై 2024


హుస్నాబాద్ మండలంలోని ఓ పొలంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు


సిద్దిపేట పట్టణంలో భారీ బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆనందమానందమాయె..

- ఉమ్మడి జిల్లాలో రైతు రుణమాఫీ సంబురాలు
- అన్నదాతలతో మాట్లాడిన సీఎం
- దామోదర వల్లేనంటూ కితాబు
- పలుచోట్ల రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉమ్మడి మెదక్ జిల్లాలో రుణమాఫీ కార్యక్రమం పండుగలా సాగింది. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా గురువారం రూ.లక్ష లోపు రుణాలున్న రైతు ఖాతాల్లో రుణమాఫీ నిధులు జమయ్యాయి. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం డాకూరు గ్రామంలోని రైతువేదికపై ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, ఆ జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి పాల్గొనగా, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇద్దరు రైతులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. తాము ఆగస్టు నుంచి రుణమాఫీ చేయాలని భావించగా, మంత్రి దామోదర రాజనర్సింహ పట్టుపట్టి ఈ నెల నుంచే అమలు చేయించారని రేవంత్ అన్నారు. ఇక పలుచోట్ల సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు క్షీరాభిషేకం చేశారు.

– న్యూస్ నెట్‌వర్క్


మిట్టపల్లి రైతువేదికలో నిర్వహించి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ మనుచౌదరి, కాంగ్రెస్ నాయకులు


సంగారెడ్డి జిల్లా జోగిపేట మండలం డాకూరులోని రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించిన వీడియోకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న రైతు శివయ్య, పక్కనే మహిళా రైతు లక్ష్మమ్మ (ఇన్‌సెట్‌లో మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్)

రుణమాఫీ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలి

- బ్యాంకు అధికారులతో కలెక్టర్ మనుచౌదరి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనుచౌదరి

సిద్దిపేట అగ్రికల్చర్, జూలై 18: రూ.లక్ష లోపు రుణమాఫీ ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలని కలెక్టర్ మనుచౌదరి బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వివిధ బ్యాంకు అధికారులతో ఆయన సమావేశమయ్యారు. జిల్లాలో 53,128 రైతుల ఖాతాల్లో రూ.లక్ష రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఈ రుణమాఫీ 2018 డిసెంబరు 12 నుంచి 2023 డిసెంబరు 9 మధ్య కాలంలో తీసుకున్న రైతులకు మాత్రమే వర్తిస్తుందన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, మండల కేంద్రాల్లో ప్ర భుత్వ మార్గదర్శకాల ప్రకారం వివరాలను అందిస్తారన్నారు. రోజువారి రుణమాఫీ వివరాలను తనకు ఇవ్వాలని ఎల్డీఎంకు తెలిపారు. బ్యాంకుల వద్ద పోలీస్ బందోబస్తు, పికెటింగ్ ఏర్పాటు చేయాలని, రైతులు సమన్వయం పాటిస్తూ బ్యాంకు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఏమైనా సమస్యలు ఎదురైతే జిల్లా వ్యవసాయ అధికారి, ఎల్డీఎం అధికారుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. అలాగే లక్ష రుణమాఫీ ప్రకియను విజయవంతంగా పూర్తిచేయాలన్నారు. సమావేశంలో ఎల్డీఎం హరిబాబు, డీఏవో మహేష్, యూబీఐ, ఏపీజీవీబీ ఆర్ఎంలు వికాస్, ఉదయ్ కిరణ్, మెదక్ డీసీసీబీ డీజీఎం విశ్వేశ్వర్ పాల్గొన్నారు.

ప్రజాపాలన సేవా కేంద్రాల ఏర్పాటు

ప్రజల సమస్యలను విని వాటిని పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ మను చౌదరి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని నేషనల్ ఇన్ఫర్మేషన్ కార్యాలయంలో(ఎన్ఐసీ) ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. జిల్లాలోని 23 మండల కేంద్రాల్లో, 5 మున్సిపాలిటీలతో పాటు కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పా టు చేసినట్లు చెప్పారు. కార్యాలయ సమయ వేళల్లో ప్రజలకు ఆరు గ్యారంటీలపై ఎలాంటి సమస్యలున్నా కేంద్రాలకు వెళ్లి పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో డీపీవో దేవకీ దేవి, ఈడీఎం ఆనంద్, కలెక్టరేట్ ఏవో అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు.



ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

మత్తు వదలరా!



సిద్దిపేటలో గంజాయికి బానిసవుతున్న యువత

- మత్తులో విచక్షణ కోల్పోయి దాడులకు పాల్పడుతున్న వైనం
- పోలీసులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ ఫలితం శూన్యం
- గంజాయి బాధితుల్లో విద్యార్థులే ఎక్కువ


సిద్దిపేట టౌన్, జూలై 18: జిల్లాలో గంజాయి మత్తు చాపకింద నీరులా వ్యాపిస్తుంది. విద్యార్థులు, యువకులు, ఆకతాయిలు గంజాయి తీసుకుంటూ మత్తులో మునిగి తేలుతున్నారు. కొన్ని రోజుల క్రితం పట్టణంలో కొంతమంది యువకులు గంజాయి మత్తులో ఓ వ్యక్తితో సిగరెట్ విషయంలో గొడవపడ్డారు. ఆ తర్వాత అర్ధరాత్రి అతని ఇంటికి వెళ్లి గంజాయి మత్తులో విచక్షణ కోల్పోయి దాదాపు 15 మంది యువకులు అతనిపై దాడి చేశారు. భయభ్రాంతులకు గురైన బాధితుడు వెంటనే 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకునేలోపే వారు పారిపోయారు. పట్టణంలోని నాసర్‌పురా, ధోబిగల్లి, నర్సాపూర్ చౌరస్తా, భారత్‌నగర్, అంబేద్కర్ నగర్, శ్రీనగర్ కాలనీ, డబుల్ బెడ్ రూంలతో పాటు మరికొన్ని కాలనీలలో స్థావరాలు ఏర్పాటు చేసుకొని, యువకులు గంజాయి మత్తులో రాత్రిపూట గొడవలకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది.

24 గంటల పాటు మత్తులో..

యువకులు మత్తులో గొడవ ఎందుకు పెట్టుకున్నారో కూడా అర్థం కాని పరిస్థితిలో ఉన్నారంటే ఏ మోతాదులో వారు మత్తుపదార్థాలను తీసుకుంటున్నారో అర్థం చేసుకోవచ్చు. గంజాయి సేవించిన యువకులు దాదాపు 24 గంటల పాటు మత్తులోనే ఉంటున్నారు. ఎక్కువగా ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుతున్న, మధ్యలో ఆపేసిన యువకులే ఉన్నారు. ఉద్యోగాలు చేయకుండా మద్యానికి అలవాటు పడి, ఆ మత్తు చాలక గంజాయికి బానిసవుతున్నారు. సిద్దిపేటలో ఉన్న కొంతమంది ధనికుల పిల్లలు గంజాయితో పాటు, డ్రగ్స్ కూడా అలవాటు చేసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. గంజాయి తీసుకున్న తర్వాత రాత్రిపూట కొంత మంది యువకులు విపరీతమైన స్పీడుతో బైక్ రైడ్‌లో పాల్గొంటున్నారు. వీరిలో కొంతమంది రోడ్డు ప్రమాదాలకు గురై గాయపడ్డ వారు కూడా ఉన్నారు.

దళారులతో కొనుగోలు

సిద్దిపేటలో కొంతమంది దళారుల చేత హైదరాబాద్ నుంచి గంజాయి ప్యాకెట్లను సరఫరా చేసుకుంటున్నారు. రూ. 500 ప్యాకెట్లు రెడీ చేసి సరఫరా చేస్తున్నారు. కొందరు కొనుగోలు చేసేంత స్థోమత లేక వాటిని సరఫరా చేస్తూ వచ్చిన డబ్బుతో గంజాయి తీసుకుంటున్నారు. ఈ సంవత్సరంలో పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి సుమారు 7 కేసులు నమోదు చేసి, దాదాపు 20 మంది వరకు అరెస్టు చేశారు.



రిహాబిలేషన్ సెంటర్లో చికిత్సలు

సిద్దిపేటలో కొంతమంది ధనికుల పిల్లలు గంజాయికి అలవాటు పడి జీవితాన్ని చిన్నాభిన్నం చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వారికి అవగాహన కల్పిస్తున్నా ఫలితం దక్కడం లేదు. వారిని హైదరాబాద్‌లోని రిహాబిలేషన్ సెంటర్‌లో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. ఇక మధ్యతరగతి కుటుంబాల పిల్లలు గంజాయికి బానిసలవుతూ చదువును మధ్యలోనే ఆపేసి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.

రౌడీషీటర్లపై నిఘా..

సిద్దిపేటలోని పలు పోలీస్‌స్టేషన్లలో రౌడీ షీటర్లుగా కేసులు నమోదైన వారిపై పోలీసులు నిఘా వ్యవస్థను పటిష్టం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పట్టణంలో పేరుమోసిన రౌడీలు గంజాయి మత్తుకు బానిసగా మారి ఇళ్లలోకి వెళ్లి దాడులు చేసేలా వ్యవహరిస్తున్న వారి భరతం పట్టాలని పలు కాలనీవాసులు కోరుతున్నారు. రౌడీషీటర్లుగా కేసులున్న వారు యువకులకు మద్యం గంజాయి మత్తును అలవాటు చేసి అనుచరులుగా మార్చుకొని పట్టణంలో లా అండ్ ఆర్డర్ సమస్యలు సృష్టిస్తున్న వారిపై ఇకనుంచి పోలీసులు కన్నేసి ఉంచాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

4 కిలోల గంజాయి పట్టివేత..

సిద్దిపేట పట్టణ శివారులోని పలు ప్రాంతాలను ఎంపిక చేసుకుంటున్న గంజాయి స్మగ్లర్లు విచ్చలవిడిగా గంజాయిని విక్రయిస్తున్నారు. ఇటీవల సిద్దిపేటలోని డబుల్ బెడ్‌రూంల వద్ద గంజాయిని సేవిస్తూ, విచ్చలవిడిగా బహిరంగంగా విక్రయిస్తున్నరన్న సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి తొమ్మిది మందిని అరెస్ట్ చేశారు. విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న 4 కిలోల గంజాయితో పాటు కారు, రూ. 23వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులు పెద్దపల్లి జిల్లా నుంచి తక్కువ ధరకు గంజాయిని కొనుగోలు చేసి సిద్దిపేటలో అధిక ధరకు అమ్ముతున్నట్లు తేలడంతో సిద్దిపేట పోలీసులు నిఘాను మరింత పటిష్టం చేశారు.


సిద్దిపేటలో శివారులో గంజాయి సేవిస్తూ పట్టుబడిన యువకులు వారి నుంచి స్వాధీనం చేసుకున్న కారు, గంజాయి ప్యాకెట్లు (ఫైల్)

రుణమాఫీ విషయంలో మెసేజ్‌లు, ఫైల్స్ ఓపెన్ చేయొద్దు

- సైబర్ నేరస్థులతో జాగ్రత్త : సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, జూలై 18 : సైబర్ నేరస్తులతో జాగ్రత్తగా ఉండాలని సీపీ డాక్టర్ బి.అనురాధ జిల్లా ప్రజలకు సూచించారు. ప్రభుత్వం చేపట్టిన రుణమాఫీ నేపథ్యంలో కొందరు సైబర్ నేరస్థులు ఏదో బ్యాంకు పేరిట వాట్సాప్‌లో ఏపీకే ఫైల్స్ పంపిస్తున్నారని, అవి ఓపెన్ చేస్తే మన వివరాలు, ఫోన్‌నంబర్లు సైబర్ నేరస్థులకు వెళ్తాయని చెప్పారు. ఆ తర్వాత గూగుల్ పే, ఫోన్ పే, యూపీఐ ద్వారా డబ్బు దోచేస్తారని సీపీ సూచించారు. ప్రస్తుతం రుణమాఫీ ట్రెండింగ్‌లో ఉన్నందున రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏపీకే ఫైల్స్, మెసేజ్ లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూఓపెన్ చేయకూడదని చెప్పారు. మీ వాట్సాప్ యాప్ పనిచేయకుంటే రీఇన్‌స్టాల్ చేసి రిపోర్ట్ ఆప్షన్‌లో రిపోర్టు చేయాలన్నారు. ఎవరైనా సైబర్ నేరానికి గురైతే 1930కి కాల్ చేయాలని సీపీ సూచించారు.




మల్లన్న ఆలయ ఉద్యోగుల బదిలీలు జరిగేనా?

- నేటితో ముగియనున్న ఆప్షన్ గడువు
- వరుస వివాదాల సుడిగుండంలో ఆలయం
- 15-20 ఏళ్లకు పైగా పాతుకుపోయిన పలువురు
- 40శాతం మించకుండా బదిలీ ప్రక్రియపై ఉత్కంఠ

చేర్యాల, జూలై 18: ప్రభుత్వం దేవాదాయశాఖ పరిధిలోని ఆలయాల్లోనూ బదిలీలకు శ్రీకారం చుట్టింది. జిల్లాలో ఏకైక డిప్యూటీ కమిషనర్ హోదా గల కొమురవెల్లి మల్లన్న ఆలయంలోని పలువురి బదిలీకి రంగం సిద్ధమైంది. ఆలయంలో మొత్తంగా 17మంది సిబ్బంది ఉన్నారు. వీరిలో ఇద్దరు ఏఈవోలు, 1 సీనియర్ అసిస్టెంట్, ఐదుగురు జూనియర్ అసిస్టెంట్లు, 1 రికార్డ్ అసిస్టెంట్, 1 ఎలక్ట్రికల్ ఏఈ, 1 ప్లంబర్, 1 జనరేటర్ ఆపరేటర్, 1 అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్స్, నలుగురు స్వీపర్లు ఉన్నారు. అర్చకులు ఇతరులు కలిసి 25మంది రిలీజియస్ సిబ్బంది ఉన్నారు. వీరిలో నాలుగేళ్లకు పైబడి పనిచేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది వివరాలను ప్రతిపాదించాలని ఇటీవల కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చా యి. ఆలయాధికారులు జాబితాను ప్రతిపాదించారు.

ఏఈవో గంగా శ్రీనివాస్ (4సంవత్సరాల 4నెలలు), ఎలక్ట్రికల్ ఏఈ బ్రాహ్మండ్లపల్లి అంజయ్య (21సం.లు), జూనియర్ అసిస్టెంట్ పోరండ్ల మాధవి (12.01సం.లు), ప్లంబర్ సార్ల విజయ్‌కుమార్ (16.2సం.లు), జనరేటర్ ఆపరేటర్ సార్ల కనకయ్య (21.7సం.లు), రికార్డ్ అసిస్టెంట్ మాచర్ల వెంకటస్వామి (23.2సం.లు), అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్ మహ్మద్ అహ్మద్ మొహియొద్దీన్ (14.7సం.లు) స్వీపర్ దువ్వాల గుండయ్య (25.2సం.లు) స్వీపర్ తాడూరు మల్లేశం (29.2సం.లు) స్వీపర్ కర్నె మాధవి (6.2సం.లు) ఉన్నారు. మరికొంతమంది కూడా సుదీర్ఘంగా పనిచేస్తున్నప్పటికీ బదిలీ నిబంధనలు వర్తించడం లేదు. గతంలో డీసీ క్యాడర్ సిబ్బందిని అదేతరహా ఆలయానికి బదిలీ చేసేవారు. కానీ కొన్నాళ్లక్రితం ఆర్‌జేసీ ఆలయాల మాదిరిగా డీసీ క్యాడర్ దేవాలయ ఉద్యోగులకూ పెన్షన్ వర్తింపచేయడంతో ప్రస్తుతం బదిలీలలో ఆర్‌జేసీ దేవాలయాలనూ ఆప్షన్‌లో పొందుపరిచారు. కానీ బదిలీ జాబితాలో గల పలువురు ఉద్యోగుల పోస్టులు ఇతర దేవాలయాల్లో లేనందున వారిని బదిలీ చేస్తారా? లేదా మిగిలిన వారిని సర్దుబాటు చేస్తారా? యధాతథంగా ఇక్కడే కొనసాగిస్తారా? అన్న ది తెలియాల్సి ఉంది. అయితే ఒక్కో ఆలయంలో ఒక్కో ఆగమశాస్త్రం అమలు చేస్తున్నందున సమస్యలు ఉత్పన్నమవుతాయని అర్చకసంఘం ప్రతినిధులు కోర్టును ఆశ్రయించడంతో స్టే పొందారు. ఈవిషయమై దేవాదాయశాఖ ఉన్నతాధికారులు అర్చకుల బదిలీల ప్రక్రియ నిలిపివేసేందుకు చర్యలు తీసుకున్న నేపథ్యంలో మల్లన్న ఆలయ అర్చకుల బదిలీ లేకపోవడంతో కొంతఊరట పొందారు. ఆలయంలో ఏళ్ల తరబడిగా పాతుకుపోయిన వారందరినీ తప్పక బదిలీ చేయిస్తామని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో కలిసి ఇటీవల ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రకటించారు. కానీ ఆలయంలో అధికంగా వారే ఉండగా, ప్రభుత్వం 40 శాతానికి మించి బదిలీ చేయకుండా చర్యలు తీసుకున్నందున ఎవరు ఉంటారు. ఎవరు స్థానచలనం పొందుతారన్నది ఇప్పుడు ఆసక్తిగా మారింది.


మల్లన్న ఆలయం

డీఎస్సీ పరీక్షలు షురూ..

- రెండు సెంటర్ల వద్ద పటిష్ట బందోబస్తు
- మొదటి రోజు 60 మంది గైర్హాజరు

సిద్దిపేట క్రైం, జూలై 18: సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం డీఎస్సీ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. జిల్లా మొత్తంలో రెండు సెంటర్లను ఏర్పాటు చేశారు. మొదటిరోజు పొన్నాల ఇందూర్ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో ఉదయం 50 మందికిగాను 45 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం 50 మందికి 42 మంది పరీక్ష రాశారు. వెరిటాస్ అండ్ వెర్టర్స్ సెంటర్‌లో ఉదయం 151 మందికి 135 మంది, మధ్యాహ్నం 118 మందికి 97 మంది హాజరయ్యారు. రెండు సెంటర్లలో కలిపి 319 మంది హాజరు కాగా, 50 మంది గైర్హాజరయ్యారు. సీపీ అనురాధ ఆధ్వర్యంలో రెండు పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతీ అభ్యర్థిని డీఎఫ్ఎండీ (డోర్ ఫ్రేమ్ మెటల్ డిటెక్టర్) ద్వారా పూర్తిగా తనిఖీ చేసి లోనికి పంపించారు. సీపీ అనురాధ పరీక్ష కేంద్రాలను సందర్శించి అధికారులకు పలు సూచనలు చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ ఆగస్టు 5 వరకు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు అమలులో ఉంటుందని చెప్పారు. ఆయా పరీక్ష కేంద్రాల సమీపంలోని అన్ని జీరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు.


అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపిస్తున్న పోలీసులు



పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఐటీఐలో ప్రవేశాలకు వెబ్ ఆప్షన్లు

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : ఐటీఐలో ప్రవేశాలకు ఈ నెల 21వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కన్వీనర్ రాజేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఐటీఐలో అడ్మిషన్ పొందవచ్చని, 1.8.2024 నాటికి 14 సంవత్సరాలు నిండిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రికార్డులన్నీ సరిగ్గా నిర్వహించాలి

● అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

కంది, జూలై 18 : రికార్డులన్నీ సరిగ్గా మెయింటెన్ చేయాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని అన్ని విభాగాలతో పాటు అక్కడి రికార్డులను పరిశీలించారు. రికార్డులు సక్రమంగా ఉంటేనే పనులు ముందుకు సాగుతాయని పేర్కొన్నారు. త్వరలో ప్రారంభించనున్న వనమహోత్సవానికి నర్సరీల్లో మొక్కలు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీవో శ్రీనివాస్, సూపరింటెండెంట్ వేణుగోపాల్ తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ మోసాలకు రైతులే గుణపాఠం చెప్తారు

● సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి రూరల్, జూలై 18 : రైతు రుణమాఫీతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మరోమారు మోసగిస్తోందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో విమర్శించారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తామని రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి, తెల్లరేషన్ కార్డు ప్రామాణికంగా ప్రకటించడంపై రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రైతు రుణమాఫీ చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు షరతులు ఎందుకు పెట్టిందని ఆయన ప్రశ్నించారు. రైతుల పట్ల ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీపై ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలు అభ్యంతరకరంగా ఉన్నాయన్నారు.

ఘనపూర్ రెండు టీఎంసీలు.. హల్దీ వాగుకు ఒక టీఎంసీ నీరు

ఎమ్మెల్యే వినతితో విడుదల చేయాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

నర్సాపూర్, జూలై 18: మెదక్ జిల్లాలోని హల్దీవాగు, ఘనపూర్ ఆనకట్టకు నీరు విడుదల చేయాలని కోరగా నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందించి అధికారులకు ఆదేశాలు జారీ చేశారని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. గురువారం 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫోన్‌లో మాట్లాడుతూ వివరాలను తెలిపారు. నర్సాపూర్ నియోజకవర్గంలోని హల్దీవాగులో ప్రస్తుతం నీరు లేకపోవడంతో రైతులు పంటలకు నీరందించే అవకాశం లేకుండా ఇబ్బంది పడుతున్నారని, ఒక టీఎంసీ నీటిని హల్దీవాగుకు కొండపోచమ్మ నుంచి విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా మెదక్ సమీపంలోని ఘనపూర్ ఆనకట్టకు కూడా రెండు టీఎంసీలు విడుదల చేయాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించి వెంటనే నీటి విడుదలకు సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. జిల్లా ప్రజల తరఫున మంత్రికి ఎమ్మెల్యే సునీతారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

సింగూరు నీటిని విడుదల చేయండి

● సీఎంకు లేఖ రాసిన మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, జూలై 18 : మెదక్ జిల్లాలో వర్షాభావం అనుకూలంగా లేకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారని, సింగూరు నుంచి ఘనపురం ఆయకట్టుకు 2 టీఎంసీల నీటిని విడుదల చేయాలని మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. అదేవిధంగా కొండపోచమ్మసాగర్ నుంచి హల్దీవాగుకు మరో రెండు టీఎంసీల నీటిని విడుదల చేయాలని విజ్ఞప్తి చేస్తూ లేఖను సీఎం కార్యాలయంలో అందజేసినట్లు తెలిపారు.

అందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

● సంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్



మాట్లాడుతున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్

సంగారెడ్డి అర్బన్, జూలై 18 : చట్టాలపై అందరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రమేశ్ సూచించారు. సంగారెడ్డిలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ లా కళాశాలలో గురువారం న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలో వివరించారు. గృహ హింస, బాల్య వివాహ నిషేధ చట్టం, పోస్కో, వరకట్న నిషేధ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులకు న్యాయపరమైన అంశాలపై సహాయం కోసం న్యాయసేవాధికార సంస్థను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. అంతకుముందు కళాశాలను తనిఖీ చేసిన ఆయన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ గీతాదేవి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకుని వీఆర్ఏ ఆత్మహత్య



నీరుడి సాయిలు

కల్హేర్, జూలై 18 : విధి నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులతో పాటు తరచూ కడుపునొప్పి బాధ ఎక్కువకావడంతో వీఆర్ఏ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం మండల పరిధిలోని మహాదేవ్‌పల్లి గ్రామ శివారులో చోటుచేసుకున్నది. హెడ్‌కానిస్టేబుల్ గంగాధర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మార్డి గ్రామానికి చెందిన నీరుడి సాయిలు(32) వీఆర్ఏగా పనిచేస్తున్నాడు. గత ప్రభుత్వ హయాంలో వీఆర్ఏలను ఇతర శాఖల్లో విలీనం చేయగా సాయిలును జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయానికి కేటాయించారు. విధి నిర్వహణ కోసం రోజూ దూరం వెళ్లి రావడం, ఆర్థికంగానూ ఇబ్బందులు పడుతున్నాడు. తన సోదరుడైన నీరుడి రమేష్ మహాదేవ్‌పల్లి గ్రామానికి ఇల్లరికం అల్లుడిగా వెళ్లగా బుధవారం సోదరుడిని కలిసేందుకు మహాదేవ్‌పల్లికి వెళ్లాడు. సోదరుని అత్తగారి ఇంట్లో నుంచి అర్ధరాత్రి వెళ్లి గ్రామ శివారులోని చింతచెట్టుకు ఉరి వేసుకున్నాడు. సోదరుడు రమేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన తెలిపారు.

యాసిడ్ తాగి మరొకరు..



రాయరపు నర్సింహాచారి మృతదేహం

తూప్రాన్, జూలై 18 : ఇంటి కొనుగోలుకు చేసిన అప్పు తీర్చలేక యాసిడ్ సేవించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో బుధవారం రాత్రి చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం కథనం ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన రాయరపు నర్సింహాచారి(40) బంగారు నగలు తయారీ వృత్తిలో కొనసాగుతూ జీవిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం ఇంటిని కొనుగోలు చేయగా, బ్యాంకు నుంచి రూ.17 లక్షలు అప్పు చేశాడు. ఆ డబ్బు సరిపోకపోవడంతో తెలిసిన వ్యక్తుల వద్ద మరో రూ.6 లక్షలు అప్పు చేశాడు. బంగారు నగల తయారీ ఆదాయం మినహా ఇతర ఆదాయం లేకపోవడంతో వడ్డీ పెరిగిపోయింది. డబ్బు చెల్లింపులు చేసే పరిస్థితి లేక బుధవారం సాయంత్రం తన దుకాణంలో బంగారం కరిగించేందుకు ఉపయోగించే యాసిడ్‌ను సేవించాడు. పక్కనే ఉన్న దుకాణ దారుడు గుర్తించడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నర్సింహాచారి బుధవారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం వివరించారు.

అన్నదమ్ముల మధ్య గొడవతో...



వేముల శ్రీనివాస్(ఫైల్)

రాయపోల్, జూలై 18 : అన్నదమ్ములతో గొడవతో విరక్తిచెంది ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండలం వీరారెడ్డిపల్లి గ్రామంలో చోటుచేసుకున్నది. రాయపోల్ ఎస్‌హెచ్‌వో కృష్ణం రాజు కథనం ప్రకారం.. వీరారెడ్డిపల్లి గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్, మల్లయ్య, కిష్టయ్య, యాదయ్య అన్నదమ్ములు. పొలం వద్ద, ఇంటి వద్ద ఉన్న భూముల విషయంలో శ్రీనివాస్‌తో మరికొందరు సోదరులకు తరచూ గొడవలు జరుగుచున్నాయి. దీంతో విరక్తి చెందిన శ్రీనివాస్ బుధవారం రాత్రి ఇంటి సమీపంలో నిర్మాణంలో ఉన్న ఓ పిల్లర్‌కు ఉరేసుకొని మృతి చెందాడు. గురువారం ఉదయం కుటుంబసభ్యులు గమనించారు. ఈ మేరకు మృతుని కొడుకు అశోక్ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి

కొల్చారం, జూలై 18 : ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్చారం పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. మండల పరిధిలోని పైతర గ్రామానికి చెందిన తాటి మల్లేశం(54) బుధవారం రాత్రి పీర్ల పండుగ ముగించుకుని కాళ్లు, చేతులు కడుక్కుందామని పైతరలోని పటేల్‌చెరువు దగ్గరికి వెళ్లాడు. ప్రమాదవశాత్తు కాలు జారి చెరువులో పడిపోయాడు. అతని భార్య నర్సమ్మ తన భర్త తిరిగి ఇంటికి రాకపోయేసరికి గురువారం ఉదయం వెతుకుతుండగా, చెరువుగట్టు వద్ద మల్లేశం ధోవతి కనిపించగా, చెరువులో గాలించగా శవం బయటపడింది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు విచారణ చేస్తున్నారు.

రూ.17.03 లక్షల విలువైన గుట్కా పట్టివేత



జహీరాబాద్‌లో పట్టుకున్న గుట్కా వాహనంతో పోలీసులు

జహీరాబాద్/నారాయణఖేడ్ జూలై 18 : జహీరాబాద్, నారాయణఖేడ్ పరిధిలో గురువారం రూ.17.03 లక్షల విలువైన గుట్కాను గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. జహీరాబాద్ పట్టణంలోని చిన్ని సత్యనారాయణ తన కిరాణా దుకాణంలో గుట్కా విక్రయిస్తున్నాడనే సమాచారంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేయగా రూ.లక్ష విలువ చేసే నిషేధిత గుట్కా, పాన్‌మసాల లభ్యమైంది. వాటిని స్వాధీనం చేసుకుని పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అలాగే ఖమ్మం జిల్లాకు చెందిన మహ్మద్ అఫ్సర్ అక్రమంగా గుట్కాలను తీసుకువెళ్తున్నట్లు నమ్మదగ్గ సమాచారం మేరకు అతడి టాటా ఏస్ వాహనాన్ని జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో పట్టుకున్నారు. వాహనంలో రూ.11.50 లక్షల విలువైన నిషేధిత గుట్కా ప్యాకెట్లను పట్టుకుని జహీరాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నారాయణఖేడ్ పట్టణంలో నిషేధిత గుట్కా పాకెట్ల గోదాంపై సీసీఎస్ పోలీసులు దాడులు చేసి పట్టుకున్నారు. ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని వెంకటేశ్వర సినిమా థియేటర్ పక్కన పాత ఇంట్లో గుట్కా ప్యాకెట్లు ఉన్నట్లు వచ్చిన సమాచారం మేరకు సంగారెడ్డి సీసీఎస్ పోలీసులు దాడులు చేశారని తెలిపారు. ఆ ఇంట్లో నిలువ చేసిన రూ.4,53,748 విలువైన గుట్కా పాకెట్లు లభించినట్లు తెలిపారు. నిందితుడు పట్టణానికి చెందిన వెంకటేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాచరణ్ వివరించారు.



ఖేడ్‌లో పట్టుబడిన గుట్కా పాకెట్లు

చికిత్స పొందుతూ బాలుడి మృతి

మునిపల్లి, జూలై 18 : ఆటో బోల్తా పడి ఆరేళ్ల బాలుడికి తీవ్ర గాయాలు కాగా, చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన గురువారం పోల్కంపల్లి గ్రామ శివారులో జరిగింది. ఇందుకు సంబంధించి మునిపల్లి ఏఎస్ఐ ఏసయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ బేగంపేటకు చెందిన మహ్మద్ అక్బర్ మొహర్రం పండుగ సందర్భంగా తన ఆటోలో న్యాల్‌కల్ మండలం శనగపల్లి గ్రామానికి బుధవారం కుటుంబసభ్యులతో కలిసి బంధువుల వద్దకు వెళ్తున్నాడు. అయితే, మునిపల్లి మండలం కంకోల్ వైపునకు వెళ్లాల్సి ఉండగా దారి తప్పి బుదేరా చౌరస్తా మీదుగా పోల్కంపల్లి వైపు వెళ్తున్న క్రమంలో అదుపు తప్పి ఆటో బోల్తా కొట్టింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న అక్బర్‌తోపాటు భార్య హస్నా బేగం, బంధువులకు స్వల్ప గాయాలయ్యాయి. కొడుకు బేగ్ వరహాన్(6)కు బలమైన గాయాలయ్యాయి. దీంతో బాలుడిని సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో గురువారం మృతిచెందినట్లు ఏఎస్ఐ ఏసయ్య తెలిపారు. తల్లి హస్నాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

హడలెత్తిస్తున్నాయ్!



చిన్నకోడూరులోని ఓ వీధిలో గుంపుగా తిరుగుతున్న కుక్కలు

వీధుల్లో గుంపులు గుంపులుగా కుక్కల సంచారం

బయటకు వెళ్లాలంటే జంకుతున్న ప్రజలు

చిన్నకోడూరు, జూలై 18 : జిల్లాలో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. గుంపులు గుంపులుగా సంచరిస్తూ స్వైర విహారం చేస్తున్నాయి. రాత్రివేళల్లో వాహనాలపై వెళ్తుంటే వెంటపడి పరుగులు తీస్తున్నాయి. దీంతో రోడ్లపైకి వెళ్లాలంటేనే మహిళలు, చిన్నారులు జంకుతున్నారు. శునకాలు రాత్రి వేళల్లో వీధుల్లో సంచరిస్తూ అరుస్తుండడంతో నిద్ర పట్టడడం లేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. శునకాల దాడిలో పలువురు గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందిన సంఘటనలు వెలుగుచూస్తున్నా, వీధి శునకాల సమస్య పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికారులు స్పందించి వీధి శునకాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఆదేవిధంగా పశువులు, జీవాల (గొర్రెలు, మేకలు)పై శునకాలు దాడిచేసి హతమార్చిన సంఘటనలూ ఉన్నాయి. చిన్నకోడూరు మండలంలోని గోనెపల్లి గ్రామంలో ఇటీవల శునకాల దాడిలో 14 జీవాలు మృతిచెందాయి.

జనవరి నుంచి కుక్క కాట్లు

మండలంలోని చిన్నకోడూరు, ఇబ్రహీంనగర్ గ్రామాల్లో రెండు పీహెచ్‌సీలు ఉండగా ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటివరకు చిన్నకోడూరు పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటుతో 124 మంది, ఇబ్రహీంనగర్ పీహెచ్‌సీ పరిధిలో కుక్కకాటుతో 126 మంది బాధితులు టీకా కోసం ఆస్పత్రులకు వచ్చినట్లు పీహెచ్‌సీల వైద్యులు తెలిపారు. కాగా రెండు పీహెచ్‌సీల లో ఆంటీ రాబీస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) అందుబాటులో ఉందని ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు చెప్పారు.

బయటకు వెళ్లాలంటే భయంగా ఉంది

వీధుల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతున్నాయి. పిల్లలు పాఠశాలలకు వెళ్లేటప్పుడు, బయట ఆడుకునేటప్పుడు కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని భయాందోళనకు గురవుతున్నాం. మేము బయటకు వెళ్లాలన్నా భయంగానే ఉంది. కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

- లక్ష్మి, చిన్నకోడూరు

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



గ్రామాల్లో శునకాల బెడద సమస్య గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. వారి ఆదేశానుసారం శునకాల నియంత్రణకు చర్యలు తీసుకుంటాం.

- సోమిరెడ్డి, ఎంపీవో, చిన్నకోడూరు



చిన్నకోడూరు మండలం గోనెపల్లిలో కుక్కల దాడిలో మృతి చెందిన జీవాలు (ఫైల్)

రుణమాఫీ సంబరాల్లో గ్రూప్ వార్

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డితో కాటా గ్రూపు వాగ్వాదం

జిన్నారం, జూలై 18 : మండలంలోని సోలక్‌పల్లి రైతువేదికలో నిర్వహించిన రైతు రుణమాఫీ కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి సహా నాయకులు నీలం మధు, గాలి అనిల్‌కుమార్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్ కూర్చోగా మాజీ ఎంపీపీ రవీందర్‌గౌడ్‌కు సీటు లేకపోవటంతో వాగ్వాదం నెలకొన్నది. సమావేశంలో కొందరు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కాటా శ్రీనివాస్‌గౌడ్ జిందాబాద్ అంటూ నినాదాలు చేయటంతో గందరగోళం నెలకొన్నది. పార్టీ కోసం కష్టపడ్డ వారికి కాకుండా ఇటీవల పార్టీలో చేరిన వారికి సీటు ఎలా ఇస్తారని నిలదీశారు. ఈ నేపథ్యంలో కార్యక్రమాన్ని త్వరగా ముగించి నాయకులు వెళ్లిపోయారు. కాగా ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన నాయకులు ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తున్నారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. పోలీసులు జోక్యం చేసుకుని ఆందోళనకారులని నిలువరించారు. కాగా, అందరినీ కలుపుకుని కార్యక్రమాలు నిర్వహిస్తామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సమావేశంలో తెలిపారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డితో వాగ్వాదానికి దిగిన కాంగ్రెస్ నేత



రైతువేదికలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీపై పక్క నియోజకవర్గ ఎమ్మెల్యే ఫొటో

వెల్దుర్తిలో కనిపించని స్థానిక ఎమ్మెల్యే ఫొటో

వెల్దుర్తి, జూలై 18 : రుణమాఫీ సంబరాలలో భాగంగా గురువారం మండల కేంద్రమైన వెల్దుర్తి రైతువేదికలో నిర్వహించిన కార్యక్రమంలో వేదికపై ఏర్పాటు చేసిన బ్యానర్‌లో స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి ఫొటో లేకపోవడం గమనార్హం. స్థానిక ఎమ్మెల్యే ఫొటోకు బదులుగా మెదక్ ఎమ్మెల్యే చిత్రంలో కూడిన ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. పలువురు గుర్తించి సూచించడంతో బ్యానర్‌ను అధికారులు సంబరాల మధ్యలోనే తొలగించారు. ఈ విషయమై మాజీ ఎంపీటీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో పార్టీలకతీతకంగా ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన అధికారులు ఇలా మర్చిపోవడం సరికాదన్నారు. ఈ సంఘటన అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి ఝాన్సీ, సొసైటీ చైర్మన్ అనంతరెడ్డి, రైతులు, నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో రాజ్యాంగానికి ప్రమాదం

● సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న చాడ వెంకట్‌రెడ్డి

గజ్వేల్, జూలై 18: బీజేపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, బీజేపీ ప్రశ్నించే గొంతులను ఇబ్బందులకు గురిచేస్తోందని సీపీఐ జాతీయ కార్యవర్గసభ్యుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఐ జనరల్ బాడీ సమావేశం జిల్లా కార్యదర్శి మంద పవన్ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఈజీఎస్ బడ్జెట్‌ని పెంచి కనీసం ఉపాధి హామీ కూలీలకు ఏడు వందల రూపాయలను ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయడం సంతోషకరమని, కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు గజ్వేల్ ప్రజల సమస్యలు తీరాయని గొప్ప మాటలు విన్నామని, తప్పితే సమస్యలు అలాగే మిగిలి ఉన్నాయని విమర్శించారు. అంతకు ముందు మున్సిపాలిటీ పరిధిలో భారీ బైక్‌ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యుడు ఎడ్ల వెంకట్‌రాంరెడ్డి, రాష్ట్ర నాయకులు ప్రకాష్‌రావు, గజ్వేల్ డివిజన్ కార్యదర్శి శివలింగు కృష్ణ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్, బెక్కంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ మాయమాటలు నమ్మొద్దు

● బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్



మాట్లాడుతున్న ప్రభాకర్

మెదక్ అర్బన్, జూలై 18 : కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒక్కటేనని, ఆ రెండు పార్టీల మాయమాటలను ప్రజలు నమ్మొద్దని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ అన్నారు. గురువారం పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కార్యకర్తల కృషితో మెదక్ ఎంపీ స్థానాన్ని గెలిచామన్నారు. అదే పట్టుదలతో రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ అత్యధిక స్థానాల్లో కాషాయ జెండాను ఎగరవేలయాలన్నారు. బూత్‌స్థాయి కార్యకర్తలు, అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జిలు సమన్వయంతో పనిచేస్తూ.. పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరిణీత, మురళీయాదవ్, నియోజకర్గ ఇన్‌చార్జీ పంజా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలి

● ఆయిల్‌పామ్ సాగుతో 30 ఏళ్ల పాటు స్థిరమైన ఆదాయం

కల్హేర్, జూలై 18 : రైతులు లాభసాటి వ్యవసాయం వైపు దృష్టి సారించాలని ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ సంగారెడ్డి జిల్లా అధికారిణి మౌనికరెడ్డి అన్నారు. గురువారం కల్హేర్ మండల పరిధిలోని క్రిష్ణాపూర్ గ్రామ శివారులో రైతు నర్సింహారెడ్డి క్షేత్రంలో అయిల్‌పామ్ మొక్కలను నాటారు. అనంతరం నిర్వహించిన రైతుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ ఒకసారి ఆయిల్‌పామ్ మొక్కలను నాటితే నాలుగో సంవత్సరం నుంచి 30 సంవత్సరాల వరకు రైతుకు స్థిరమైన ఆదాయం అభిస్తుందని తెలిపారు. చీడపీడల బెడద, అకాల వర్షాలు, వడగండ్లు ఎలాంటి ప్రభావం చూపవని పేర్కొన్నారు. అంతరపంటగా ఇతర పంటలు సాగు చేసుకోవచ్చునన్నారు. అయిల్‌పామ్ ఒక మొక్క ధర రూ.193 ఉంటే ప్రభుత్వం సబ్సీడిపై రూ.20లకే అందిస్తుందని అన్నారు. అలాగే, డ్రిప్ పరికలాలు కూడా అందిస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా పంటల యాజమాన్యం కోసం రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేయడం జరుగుతుందని మౌనికరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో గోద్రెజ్ అగ్రోటెక్ కంపెనీ డీజీఎం వేగుంట స్వీటి, కల్హేర్ మాజీ జడ్పీటీసీ నర్సింహారెడ్డి, మాజీ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్‌గౌడ్, పీఏసీఎస్ సీఈవో బ్రహ్మం, రైతులు పాల్గొన్నారు.



మొక్కను నాటుతున్న రైతు

వైకుంఠధామం.. ప్రారంభానికి సిద్ధం

● నర్సాపూర్‌లో సకల సదుపాయాలతో నిర్మాణం

నర్సాపూర్, జూలై 18 : కనీసం నీళ్ల సదుపాయం కూడా లేకుండా ఉన్న నర్సాపూర్ శ్మశానవాటిక నిర్మాణం ఎట్టకేలకు పూర్తయింది. నర్సాపూర్-హైదరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో పట్టణ పరిధిలోని అన్ని వర్గాల వారికి విశాలమైన శ్మశానవాటిక ఉన్నది. కానీ అక్కడ అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు ఎలాంటి సదుపాయాలు లేవు. కనీసం అంత్యక్రియలు పూర్తయిన తర్వాత స్నానాలు చేయడానికి కూడా సౌకర్యం లేకపోవడంతో సమీపంలోని చెరువు వద్దకు వెళ్లి స్నానాలు చేసేవారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు అందులో పడి మృత్యువాత పడిన ఘటనలూ ఉన్నాయి. వీటిన్నింటిని గుర్తించిన మున్సిపల్.. ఈ శ్మశానవాటికను అధునాతన పద్ధతిలో తీర్చిదిద్దాలనే ఆలోచనతో ప్రభుత్వం నుంచి వచ్చిన రాష్ట్ర ఫైనాన్స్ నిధులు రూ.కోటి కేటాయించింది.



పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా స్నానాల గదులు

అన్ని సౌకర్యాలతో..

కోటి రూపాయల నిధులతో చేపట్టిన పనుల్లో ప్రత్యేకంగా పురుషులు, మహిళలకు స్నానాల గదులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా రెండు దహన సంస్కారాల ప్లాట్‌ఫామ్‌లు, అంత్యక్రియలు పూర్తయ్యే వరకు సంబంధీకులు వేచి ఉండే గది, దింపుడు కల్లం, పూజలు నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాటు చేశారు. వీటితోపాటు నీటి వసతి, ప్రహరీ నిర్మాణం చేపట్టి వైకుంఠధామాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్ది ప్రారంభానికి సిద్ధంగా ఉంచారు.

వైకుంఠధామాన్ని త్వరలో ప్రారంభిస్తాం

నర్సాపూర్‌లో అన్ని హంగులతో నిర్మించిన వైకుంఠధామాన్ని త్వరలోనే ప్రారంభిస్తాం. అంత్యక్రియలకు వచ్చేవారికి ఇబ్బంది రాకుండా అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు పచ్చదనంపై ప్రత్యేక శ్రద్ధ చూపించాం. గార్డెన్‌ను తలపించేలా మొక్కలు పెంచుతున్నాం.

- అశోక్‌గౌడ్, మున్సిపల్ చైర్మన్



దహన సంస్కారాలు చేసేందుకు ప్రత్యేక నిర్మాణం

రహదారులు అధ్వానం



గంతలమయంగా మారిన రాళ్లకత్వ-కంజర్ల దారి

జిన్నారం, జూలై 18 : మండలంలోని పలు ప్రధాన రహదారులు పూర్తి గుంతలమయం అవడంతో ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారాయి. కాజీపల్లి, మల్లంపేటల మధ్య ఔటర్ రింగ్‌రోడ్డు బ్రిడ్జి కింద నీరు నిలిచి రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. రెండేళ్లుగా ఇక్కడ వర్షపు నీరు వెళ్లే దారి లేక భారీగా నీరు చేరి ప్రయాణాలు చేయటం సాహసంగా మారింది. బ్రిడ్జికి ఇరువైపులా ప్రయాణాలు చేయకుండా బారీకేడ్లు అడ్డుగా పెట్టారు. ఇక బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రధాన రహదారి గత నాలుగేళ్లుగా మట్టి రోడ్డుగానే ఉన్నది. బొల్లారం కాజీపల్లి మధ్య గతంలో బీటీ రోడ్డు వేయగా కోర్టు కేసు కారణంగా పనులు జరుగలేదు. ఆ కేసు పరిష్కారమై రెండేళ్లు గడిచినా పనులు చేపట్టడం లేదు. సోలక్‌పల్లి, కంజర్ల రోడ్డు పనులు అసంపూర్తిగా నిలిచిపోవటంతో గుంతలమయంగా మారింది. ముఖ్యంగా రాళ్లకత్వ నుంచి కంజర్ల వరకు బీటీ వేయాల్సి ఉండగా పనులు నిలిచిపోవటంతో భారీ గుంతలు ఏర్పడి నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. అసంపూర్తి రోడ్డును వెంటనే పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.





కాజీపల్లి సమీపంలో ఔటర్ రింగ్ రోడ్డు బ్రిడ్జి కింద వారం రోజులుగా నిలిచిన నీరు, బీటీకి నోచుకోని బొల్లారం-కాజీపల్లి ప్రధాన దారి

రుణమాఫీపై రైతుల హర్షం

● సీఎం, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం

● బాణసంచా కాల్చి, స్వీట్లు పంచిన నాయకులు

సిద్దిపేట అర్బన్, జూలై 18: ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం పట్ల వర్షం వ్యక్తం చేస్తూ సిద్దిపేట అర్బన్ మండల ఆయా గ్రామాలకు చెందిన రైతులు గురువారం మిట్టపల్లి రైతు వేదిక వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషకం చేశారు. అనంతరం జరిగిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మను చౌదరితో పాటు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, పీఏసీఎస్ చైర్మన్ చింతల శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు నాయిని నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● **ములుగు:** రాష్ట్ర రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడమే కాంగ్రెస్ నైజం అని గజ్వేల్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కడపల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. గురువారం ములుగు మండలం అన్నాసాగర్, ములుగు గ్రామాల్లో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మహిపాల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, జిల్లా మాజీ కోఆప్షన్ సభ్యులు సయ్యద్‌సలీం, నీలం ప్రభాకర్ రెడ్డి, శశికాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, ఏకాంబరెడి పాల్గొన్నారు.

● **మద్దూర:** మద్దూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎల్‌ఈడీ స్ర్కీన్ ద్వారా ఏర్పాటు చేసిన సీఎం రైతురుణమాఫీ కార్యక్రమాన్ని ఉమ్మడి మండల రైతులు వీక్షించారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ దూళిమిట్ట మండల అధ్యక్షుడు కోల సాయిలు, ఏపీజీవీబీ మేనేజర్ హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి బూరెల రామకృష్ణ, సొసైటీ సీఈవో బోయిని శ్రీధర్, ఏఈవోలు రాకేష్, అఖిల్, పార్టీ అధ్యక్షకార్యదర్శులు మేక మల్లేశం, ఊట్ల శ్రీధర్‌రెడ్డి, జిల్లా నాయకులు కామిడి జీవన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ముస్త్యాల మనోహర్, మండల మహిళా అధ్యక్షురాలు గుండెగోని లలితమల్లేశం, గ్రామశాఖ అధ్యక్షుడు షౌకత్ అలీ, నాయకులు బుర్ర శంకర్, కనకచంద్రం, కాటం బాలయ్య, బొమ్మగాని శివయ్య, పుల్లూరి రాజు, పెద్దఊట్ల కర్ణాకర్‌రెడ్డి, సుందరగిరి సత్యనారాయణ, నీరటి సాయికిరణ్, ముంతాజ్, సోషల్ మీడియా కన్వీనర్ ఎర్ర బచ్చల శ్రీకాంత్, నీల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

● **దూళిమిట్ట:** మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో తాజా మాజీ జడ్పీటీసీ గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కోల సాయిలు గౌడ్, బెక్కల్ దేవస్థానం చైర్మన్ చొప్పరి మల్లేశం, మహిళ విభాగం అధ్యక్షురాలు చల్ల లత, గ్రామశాఖ అధ్యక్షుడు చెప్యాల అనిల్‌గౌడ్, డైరెక్టర్ పాల్మ శ్రీనివాస్, చెన్నోజు బ్రహ్మచారి, మాజీ సర్పంచులు చంద్రారెడ్డి, రేణుక నర్సింహులు, గద్దల మహేందర్, నాచగోని మహేష్‌గౌడ్, బాలయ్య, సాగర్ గౌడ్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **మర్కుక్:** సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి నాగేందర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్‌గౌడ్, మండల అధ్యక్షుడు కనకయ్యగౌడ్, మండల ఉపాధ్యక్షుడు ర్యాకం యాదగిరి, యూత్ అధ్యక్షుడు నర్సింహులు, మండల రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సింగం వెంకటేష్, తిరుపతిరెడ్డి, సుగుణాకర్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహులు, యాదగిరి, వ్యవసాయ విస్తరణ అధికారులు రజనీకాంత్, విష్ణు తదితరులు ఉన్నారు.

● **నంగునూరు:** మండలంలోని పాలమాకుల రైతువేదికలో సీఎం రేవంత్‌రెడ్డి రైతు రుణమాఫీ నిధుల విడుదల వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని గురువారం పండుగ వాతావరణంలో రైతులతో కలిసి అధికారులు తిలకించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి గీత, తహసీల్దార్ సరిత, ఎంపీడీవో వేణుగోపాల్, వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి నంగునూరు మండలం నర్మెట్ట గ్రామంలో క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు, మోతకాని కనకయ్య, కాంగ్రెస్ జిల్లా నాయకులు గందమల్ల యాదగిరి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు కొమ్మూరి రాజిరెడ్డి, దండ్ల పరుశురాములు, మాంకాల కనకయ్య, రాములు, బాల్ కిషన్, బోదాసు రాజు, మహేష్, శేఖర్, బోదాసు తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట టౌన్:** సిద్దిపేట పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ, పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ ఆధ్వర్యంలో రుణమాఫీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, గూడూరి శ్రీనివాస్, బొమ్మల యాదగిరి, కలీమొద్దీన్, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, ముద్దం లక్ష్మి, బుచ్చిరెడ్డి, సాకి ఆనంద్, రియాజుద్దీన్, గుర్రం అంజిరెడ్డి, గరిపల్లి రాములు, బిక్షపతి, బర్మా రాములు, మార్క సతీష్, సాంబమూర్తి, పూజల గోపికృష్ణ, మంద పాండు, వహాబ్, మైహిపాల్‌రెడ్డి, ఎర్ర మహేందర్, షాబోద్దీన్, గాయసుద్దీన్, ఎర్రబోలు రాజిరెడ్డి, రాషద్, సదానందం, అజ్మత్, వంశీ, సాయిప్రతాప్, అరవింద్, పవన్, శివ పాల్గొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్ పట్టణంలో రైతులతో కలిసి పంట రుణమాఫీ సంబరాల్లో భాగంగా డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌజింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ మడుపు భూంరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షురాలు అంక్షారెడ్డి, మాజీ కౌన్సిలర్లు సుభాష్ చంద్రబోస్, రామచంద్రాచారి, సత్యనారాయణ గుప్తా, పార్టీ పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, ప్రధాన కార్యదర్శి రాములుగౌడ్, నాయకులు లక్ష్మారెడ్డి, సమీర్, మతిన్, సర్దార్‌ఖాన్, గుంటుకు శ్రీనివాస్, రమేష్‌గౌడ్, శివారెడ్డి, అజ్గర్, ప్రభాకర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలుపుకోవడం కాంగ్రెస్‌తోనే సాధ్యమని టీపీసీసీ అధికార ప్రతినిధి బండారు శ్రీకాంత్‌రావు అన్నారు. గజ్వేల్ పట్టణంలో రైతులతో కలసి కాంగ్రెస్ నాయకులు మిఠాయిలు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. వారితో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బయ్యారం మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు మొనగారి రాజు, న్యాయవాది గోపాల్‌రావు, ములుగు మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గుప్తా ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి రాచకొండ ప్రశాంత్, క్యాసారం బాబా, నాయకం శ్రీనివాస్, నాయిని తిరుపతి, మంద నర్సింహులు, ములుగు మండల రైతు అధ్యక్షుడు రాజు, గజ్వేల్ ఎన్‌ఎస్‌యూఐ నియోజకవర్గ సభ్యుడు రాజశేఖర్ పాల్గొన్నారు.

చేర్యాల: రైతువేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని రైతులు తిలకించారు. చేర్యాలలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. వ్యవసాయ పొలాల వద్ద రైతులతో కేక్‌కట్ చేయించారు. ఆయా కార్యక్రమాల్లో పట్టణాధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు ఆడెపు నరేందర్, చెవిటి లింగం, ముస్త్యాల తార యాదగిరి, నాయకులు బండెల మహిపాల్‌రెడ్డి, పుర్మ ఆగంరెడ్డి, ఆడెపు చంద్రయ్య, దాసరి శ్రీకాంత్, సనాది భాస్కర్, తడక లింగం, నీలం సన్నీ పాల్గొన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం నిర్వహించారు. బాణసంచా కాల్చిమిఠాయి పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పార్టీ మండలాధ్యక్షుడు మహదేవుని శ్రీనివాస్, ఐనాపూర్ గ్రామంలో మాజీ సర్పంచు చెరుకు రమణారెడ్డి, నాయకులు లింగంపల్లి శ్రీనివాస్, లింగంపల్లి కనకరాజు, కాయిత శ్రీనాథ్ రెడ్డి, వుప్పల వంశీకృష్ణ, సనాది భాస్కర్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లంబజార్ రైతు వేదిక వద్ద కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి, స్వీట్లు పంపిణీ చేసి బాణాసంచా కాల్చి సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొన్నం ప్రభాకర్‌ల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ రైతులు వీక్షించారు. కార్యక్రమంలో టీపీసీసీ మెంబర్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

● **సిద్దిపేట రూరల్/నారాయణరావుపేట:** సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్, నారాయణరావుపేట రైతు వేదికల్లో సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షించారు. నారాయణరావుపేట రైతు వేదికలో సాంకేతిక సమస్యతో వీడియో కాన్ఫరెన్స్‌లో వాయిస్ మాత్రమే వినబడింది. వ్యవసాయ అధికారులు పరశురాంరెడ్డి, వెంకట రమణి, ఎఈవోలు నాగర్జున్, మౌనిక, స్పందన, సుమిత్ర తదితరులు పాల్గొన్నారు.


చేర్యాల: చేర్యాలలో వ్యవసాయపొలంలో రైతులతో కేక్‌కట్ చేయిస్తున్న కాంగ్రెస్ నాయకులు


సిద్దిపేట టౌన్: పట్టణంలో డ్యాన్స్ చేస్తూ సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నాయకులు


దూళిమిట్ట: దూళిమిట్ట మండల కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


రాయపోల్: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


వర్గల్: మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


చిన్నకోడూరు: వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న అధికారులు, రైతులు, నాయకులు


తొగుట: గుడికందులలోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం ప్రసంగాన్ని వింటున్న రైతులు


గజ్వేల్ : పట్టణంలోని రైతువేదిక వద్ద సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు


మద్దూరు: రైతు వేదికలో ఏర్పాటు చేసిన సీఎం వీడియో కాన్ఫరెన్స్‌ను వీక్షిస్తున్న రైతులు


కొండపాక: సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న దేవేందర్ రెడ్డి తదితరులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌గా పవన్

గజ్వేల్, జూలై 18: గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్‌గా పవన్ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు డిపో మేనేజర్‌గా పనిచేసిన బి.సురేఖ బదిలీపై మెదక్ డిపోకు వెళ్లగా, టీజీఎస్ఆర్టీసీలో పనిచేస్తున్న పవన్ గజ్వేల్‌కు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా మాజీ డీఎం సురేఖను డిపో సిబ్బంది ఘనంగా సన్మానించారు. అంతా కలసికట్టుగా పనిచేస్తే సంస్థ అభివృద్ధిలో పయనిస్తుందన్నారు. కొత్తగా వచ్చిన డీఎం పవన్ మాట్లాడుతూ.. సంస్థ, డిపో అభివృద్ధికి సిబ్బంది సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ బాబునాయక్, ఆర్‌పీ రెడ్డి, జయేందర్‌రెడ్డి, నాగభూషణం, సందీప్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐలో చేరిక

గజ్వేల్, జూలై 18: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి జగదేవ్‌పూర్ మండలం తీగుల్ గ్రామానికి చెందిన భట్టు దయానందరెడ్డి, విశ్రాంత హాస్టల్ వార్డెన్ రాజేశంలు సీపీఐలో చేరారు. గతంలో సీపీఐలో ఆయా హోదాల్లో పనిచేసిన దయానందరెడ్డి మూడేళ్ల క్రితం బీఆర్ఎస్‌లో చేరారు. సరైన గుర్తింపు లభించకపోవడంతో సొంత గూటికి చేరానని తెలిపారు. వారికి సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

'బీఆర్ఎస్ నాయకులు శవ రాజకీయాలు చేస్తున్నారు'

కొండపాక, జూలై 18: బీఆర్ఎస్ నాయకులు శవరాజకీయాలకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ మెదక్ నియోజకవర్గ నాయకుడు నీలం మధు, డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి, డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి ఆరోపించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దమ్మకపల్లి గ్రామానికి చెందిన రైతు కిష్టయ్యను గురువారం వారు పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కుటుంబసమస్యలు, ఆస్తి తగాదాల్లోకి కాంగ్రెస్ నాయకులను లాగడం తగదన్నారు. రాజీనామాను తప్పించుకోవడానికి హరీశ్‌రావు డ్రామాలాడుతున్నారని ఆరోపించారు. దమ్మకపల్లికి చెందిన రైతు కిష్టయ్య గట్టు పంచాయితీతో పురుగులమందు తాగితే దానిని కాంగ్రెస్ నేతలపై వేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్ రైతుల పక్షపాతి అని తెలిపారు.

ఆర్థిక సహాయం అందజేత

దూళిమిట్ట, జూలై 18: మండలంలోని బైరాన్‌పల్లిలో అప్పిసు బాలమ్మ(65) అనారోగ్యంతో గురువారం మృతిచెందింది. కాంగ్రెస్ సీనీయర్ నాయకులు గందె మల్లేశం, మాజీ సర్పంచులు ఎడవెల్లి చంద్రారెడ్డి, బండి శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు కొలిపాక ఉపేందర్‌తో కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం గందె మల్లేషం మృతిరాలి కుటుంబసభ్యులకు రూ.3000 ఆర్థిక ఆహాయం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు ఇమ్మడి పురుషోత్తంరెడ్డి, బాపు రాజు, మాధవరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, గందె రాజు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను వినియోగించుకోవాలి

● ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత


నారాయణరావుపేట: గుర్రాలగొందిలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

నారాయణరావుపేట/చేర్యాల, జూలై 18: అంగన్‌వాడీ కేంద్రాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసంత సూచించారు. మండలంలోని గుర్రాలగొందిలో అమ్మ మాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు సంరక్షణకు అంగన్‌వాడీ కేంద్రాలు దోహదపడుతాయని అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వీ. రేణుక, చిలుక, అంజమ్మ, ఆశా వర్కర్లు లలిత, శంకరవ్వ, తదితరులు పాల్గొన్నారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలోని అంగన్‌వాడీ-3,6,11 కేంద్రాల ఆధ్వర్యంలో చేపట్టిన అమ్మమాట-అంగన్‌వాడీ బాటను మునిసిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి ప్రారంభించారు.

భూముల జోలికి వస్తే ఊరుకోం

● బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి


విలేకరులతో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

గజ్వేల్, జూలై 18: గజ్వేల్ పట్టణంలోని పురాతన శివాలయం భూముల జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదని బీజేపీ రాష్ట్ర నాయకుడు ధరం గురువారెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ అధ్యక్షుడు దేవులపల్లి మనోహర్‌యాదవ్ హెచ్చరించారు. గజ్వేల్ పట్టణంలోని శివాలయం భూములను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ.. భూమి జోలికి వస్తే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. ఆయనవెంట బీజేపీ నాయకులు కుడిక్యాల రాములు, నాయిని సందీప్, వెంకట్‌రెడ్డి, మైస విజయ్, కిష్టాగౌడ్, నాగులు ముదిరాజ్, భాస్కర్‌రెడ్డి, రాజుయాదవ్ ఉన్నారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం


చిన్నకోడూరులో పీరీల ఊరేగింపు

చిన్నకోడూరు, జూలై 18: చిన్నకోడూరు మండల కేంద్రంలో మొహర్రంను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఈ సందర్భంగా పీరీలను డప్పు చప్పుళ్లతో ఊరేగింపు చేశారు. ఇండ్ల వద్దకు వచ్చిన పీరీలకు భక్తులు దట్టీలు కట్టి, కూడకలు వేశారు. ఊదు, బెల్లం చదివించి మొక్కులు తీర్చుకున్నారు. గ్రామ చావిడి వద్ద అసైదులా అంటూ అల్వా ఆటతో సందడి చేశారు.

వానరానికి అంత్యక్రియలు

మద్దూరు, జూలై 18: మండల కేంద్రంలోని లక్కపల్లి- లద్నూరు గ్రామాల మధ్య గురువారం ఓ వానరం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. బాటసారుల ద్వారా విషయం తెలుసుకున్న ఏఎస్ఐ జగదీశ్వర్ వానరానికి సిబ్బందితో కలిసి అంత్యక్రియలు నిర్వహించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పరుశురాములు, సురేష్, సిబ్బంది అరుణ్ ఉన్నారు.


వానరానికి అంత్యక్రియలు చేస్తున్న పోలీసులు

రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలి

● టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం

సిద్దిపేట టౌన్, జూలై 18: రైతులు, ప్రజలు సంతోషంగా ఉండాలని టీపీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం ఆకాక్షించారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని ముత్యాల పోచమ్మ ఆలయంలో బోనాల ఉత్సవాలు నిర్వహించి, కోమటిచెరువు కట్టపై ఉన్న కట్ట మైసమ్మకు బోనం సమర్పించారు. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన దరిపల్లి చంద్రం మాట్లాడుతూ.. ప్రతీ ఏటా జరుపుకునే ముత్యాల పోచమ్మ బోనాల ఉత్సవాలను ఈ ఏడాది కూడా ఘనంగా నిర్వహించుకున్నామన్నారు. అమ్మవారి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు చెప్పారు.


సిద్దిపేట టౌన్: సిద్దిపేట పట్టణంలో బోనాల ఊరేగింపులో దరిపల్లి చంద్రం

పాండురంగ ఆశ్రమంలో మహా అన్నదానం

మర్కుక్, జూలై 18: మండల పరిధిలోని భవానందాపూర్ గ్రామ శివారు ప్రాంతంలోని రుక్మిణి పాండురంగస్వామి ఆశ్రమంలో గురువారం భక్తులకు మహా అన్నదానం నిర్వహించారు. జాతర చివరి రోజు అవడంతో భక్తులు భారీగా తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉదయం మాధవానంద సరస్వతిస్వామి రుక్మిణి పాండురంగ స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు స్వామివారి అనుగ్రహ భాషనం చేస్తూ.. నాదం సాదం ఇక్కడ ముఖ్యమైనవని, భుజించే ముందు భగవంతుడి భజన ఎంతో ముఖ్యమని, ప్రతి ఒక్కరూ భగవత్ ప్రసాదాన్ని బుద్ధితో స్వీకరించాలని ఉద్బోదించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, పురోహితులు అప్పాల సత్యనారాయణశర్మ, విట్టలశర్మ, రసరాజుశర్మ, మదునూరి వెంకటరామశర్మ, మాధవశర్మ, రాధాపతి శర్మ, బావానందశర్మ, శశిధర్‌శర్మ, పాండురంగ ఆశ్రమ భక్తులు పాల్గొన్నారు.



మర్కుక్: భక్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న మాదవానంద సరస్వతి

అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

● సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

చిన్నకోడూరు, జూలై 18: అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులకు సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను సూచించారు. చిన్నకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలు, సైబర్ నేరాలు, గుడ్, బాడ్ టచ్, గంజాయి ఇతర మత్తు పదార్థాలు, సీసీ కెమెరాలు, ఈవ్‌టీజింగ్, నూతన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేస్తే ఎలాంటి వివరాలు చెప్పవద్దని, గంజాయి ఇతర మత్తు పదార్థాల జోలికి వెళ్లవద్దన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మయ్య, ఉపాధ్యాయులు, సిద్దిపేట షీటీం బృందం సభ్యులు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.


చిన్నకోడూరు: హైస్కూల్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను

అత్యవసర ఫోన్‌నెంబర్లను గుర్తుంచుకోవాలి

కుకునూరుపల్లి, జూలై 18: అత్యవసర ఫోన్ నెంబర్లను గుర్తుంచుకోవాలని తొగుట సీఐ లతీఫ్ కోరారు. కుడారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో గురువారం షీటీం బృందం సభ్యులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థులు పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్లు, ఇతర అత్యవసర ఫోన్ నెంబర్లను గుర్తుంచుకోవాలని సూచించారు. పదోతరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి పారితోషికం అందిస్తామని, విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో షీటీం ఏఎస్ఐలు సువర్ణ, రాములు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆభరణం మాయంపై పోలీసుల దర్యాప్తు

● అర్చకుడిని ఆరా తీసిన ఎస్ఐ రాజు

చేర్యాల, జూలై 18: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఇటీవల చేపట్టిన హుండీ లెక్కింపులలో లభ్యమైన భక్తుల మొక్కుబడి బంగారు గొలుసు అపహరణయత్నంతో పాటు ఓ ఉంగరం మాయమైందన్న విషయమై పోలీసులు గురువారం దర్యాప్తు ప్రాంభించారు. ఈ తతంగంలో ఏఈవో గంగా శ్రీనివాస్‌పై అనుమానం ఉందని ఈవో బాలాజీ పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. మొక్కుబడి ఆభరణాలు భద్రపరిచిన ప్రదేశంలో ఈవో బాలాజీశర్మ, ఏఈవో గంగా శ్రీనివాస్, అర్చకుడు మహదేవుని మనోహర్, ఎలక్ట్రికల్ విభాగం సిబ్బంది హైమద్ తదితరులు ఉన్నారు. ఈవో బాలాజీశర్మ భోజనం చేసి వచ్చేంతలో ఆభరణం కనబడకుండా పోయిన విషయాన్ని అర్చకుడు మహదేవుని మనోహర్ గుర్తించి తెలపడంతో పరిసరాల్లో వెతకడంతో గొలుసు చెత్తకుప్పలో లభ్యమైంది. ఈవిషయమై ఏఈవో గంగా శ్రీనివాస్‌పైనే అనుమానాలు తలెత్తడంతో అదే సమయంలో ఆయన స్పందించకుండా ఎలాంటి ప్రకటన చేయలేదు. కానీ సీసీకెమెరా ఫుటేజీలు పరిశీలించినప్పటికీ సంబంధిత ప్రదేశం రికార్డు కాకపోవడంతో సందిగ్ధత ఏర్పడింది. రెండురోజుల తరువాత ఆయన స్పందించడం చర్చనీయాంశమైంది. బంగారు ఆభరణ అపహరణయత్నంతో తనకెలాంటి సంబంధం లేదని పేర్కొనడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కొమురవెల్లి ఎస్ రాజుగౌడ్ గురువారం అర్చకుడు మహదేవుని మనోహర్‌ను విచారించారు. అనంతరం ఈవో, ఏఈవోలను విచారించేందుకు ఉపక్రమించినా ఇరువురూ అందుబాటులో లేరు. ఈవిషయమై ఎస్ఐ రాజు గౌడ్ మాట్లాడుతూ.. ఈవో ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని, సీసీటీవీ ఫుటేజీలలో రికార్డు కాకపోయినా గొలుసు అపహరణకు యత్నించిన వారిని వదిలిపెట్టబోమన్నారు.


మల్లన్న ఆలయ ఆవరణలో మాట్లాడుతున్న రాజారాం

ఏఈవోను సస్పెండ్ చేయాలి

బంగారు గొలుసు అపహరణకు యత్నించిన ఏఈవో గంగా శ్రీనివాస్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని వీహెచ్‌పీ మెదక్ విభాగ్ సహకార్యదర్శి రాజారాం డిమాండ్ చేశారు. బంగారు ఆభరణాల మాయాజాలంపై గురువారం ఆయన మల్లన్న ఆలయాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆలయంలో హుండీలెక్కింపుల నిర్వహణలో తగిన భద్రతాచర్యలు చేపట్టకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో నాయకులుబూస నరేశ్, ఎక్కలదేవి శ్రీనివాస్, భరత్, రాజేందర్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు పంగనామం

● బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేరుగు మహేశ్

సిద్దిపేట టౌన్, జూలై18: కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా ఏమాత్రం స్పందన లేకుండా, సంక్షేమ పథకాలకు పంగనామం పెట్టిందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మేరుగు మహేశ్ విమర్శించారు. సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి ఫలితంగానే రుణమాఫీ చేస్తున్నారని తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు సంక్షేమ పథకాలు రైతుబంధు, రైతు రుణమాఫీ, రైతుబీమా వంటి పథకాలు చిన్న, సన్నకారు రైతుల నుంచి పెద్ద రైతుల వరకు వర్తించాయన్నారు. కానీ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భరోసా ఇచ్చిన ప్రభుత్వం కాదని, ప్రజలకు బాకీపడ్డ ప్రభుత్వమన్నారు. రుణమాఫీ కూడా పూర్తిస్థాయిలో చేయడం లేదని, దీనికి అనేక అంక్షలు విధిస్తూ, జీవో కాగితాల్లో రేషన్‌కార్డు అంటూ మెలికలు పెడుతూ, నోటి మాటగా మాత్రం ఏమీ లేదని తప్పించుకోవాలని ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. పూర్తి రుణమాఫీ అయ్యేంత వరకు బీఆర్ఎస్ ప్రజల పక్షాన నిలిచి ఉద్యమిస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రెడ్డి యాదగిరి, బండి శ్రీకాంత్, బూరుగుపల్లి రామరాజు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మహేశ్

గ్రూప్-2 పరీక్షను వాయిదా వేయాలి

● ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ డిమాండ్



జిల్లా గ్రంథాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులు

సిద్దిపేట అర్బన్, జూలై 18: గ్రూపు 2 పరీక్ష వాయిదా వేసి గ్రూప్ 3 పోస్టులను పెంచేలా చూడాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం సిద్దిపేటలోని జిల్లా గ్రంథాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు ఆముదాల రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రూప్ 2, గ్రూప్ 3 పరీక్షలను వెంటనే వాయిదా వేయాలని, నోటిఫికేషన్‌లు వెంటవెంటనే ఇస్తూ ప్రస్తుతం డీఎస్సీ పరీక్ష రాస్తున్న సమయంలోనే గ్రూప్ 2, గ్రూప్ 3 హాల్ టికెట్లు ఇవ్వడం, ఒకే తేదీల్లో పరీక్షలు పెట్టడం నిరుద్యోగులను మోసం చేయడమేనని ఆరోపించారు. ఖాళీగా ఉన్న గ్రూప్ 2, గ్రూప్ 3 పోస్టులను పెంచి జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని కోరారు. లేనియెడల రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు చెప్యాల సంతోష్, తాడూరి భరత్, బత్తుల అభి, తిరుపతి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో విద్యార్థిని ప్రతిభ

చేర్యాల, జూలై 18: ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన పోస్టర్‌మేకింగ్ పోటీలో చేర్యాల మండలం నాగపురి జడ్పీఎస్ఎస్‌కు చెందిన 8వతరగతి విద్యార్థి భీమనపల్లి దీక్షిత జిల్లాస్థాయి తృతీయబహుమతి కైవసం చేసుకుంది. ఈ మేరకు గురువారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు దీక్షితకు బహుమతి అందజేశారు.


బహుమతి అందుకుంటున్న దీక్షిత

రోడ్లను పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు


నమూనాలు సేకరిస్తున్న అధికారులు

గజ్వేల్, జూలై 18: గజ్వేల్-ప్రజ్ఞాపూర మునిసిపాలిటీ పరిధిలోని సీసీ రోడ్లను క్వాలిటీ కంట్రోల్ డీఈ శ్రీకాంత్, ఏఈ విజయరాజ్ పరిశీలించారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. కాంట్రాక్టర్లు నాణ్యతా ప్రమాణాలు లేకుండా పనులు చేపట్టారని ఫిర్యాదులు అందడంతో నమూనాలు సేకరించినట్లు తెలిపారు. ల్యాబ్‌కు పంపించి లోపాలను నిగ్గు తేలుస్తామన్నారు. ల్యాబ్ రిపోర్టులను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. వారితో వార్డు కౌన్సిలర్ బాలమణి, గ్రామస్థులు వీరేశం, సిద్దల రవి, మల్లయ్య, బింగి స్వామి, బాబుగౌడ్ ఉన్నారు.